సాక్షి
పశ్చిమగోదావరి

మంగళవారం । 23 । మే । 2023



చంద్రబాబు క్షమాపణ చెప్పాలి

ప్రభుత్వం పేదలకు అందిస్తున్న ఇంటి స్థలాలపై చంద్రబాబు వ్యాఖ్యలకు నిరసనగా పాలకొల్లులో ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. 8లో ▸



సినిమా షూటింగ్ సందడి

పోలవరంలోని బంగారంపేట కనకదుర్గమ్మ ఆలయం వద్ద సాయిరామ్ శంకర్ హీరోగా జూరెడ్డి సత్యప్రకాష్ దర్శకత్వంలో సినిమా షూటింగ్ ప్రారంభమైంది. 8లో ▸



కేరళ మేళానికి క్రేజ్

ఉత్సవాలు, వివాహాది శుభకార్యాల్లో కేరళ చండా మేళం ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. దీనిని గ్రామీణ యువకులు ఉపాధి మార్గంగా ఎంచుకుంటున్నారు. 8లో

న్యూస్‌రీల్

ముఖ్యమంత్రిని కలిసిన చీఫ్ విప్ ముదునూరి



సీఎం జగన్‌కు మామిడి పండ్లు అందిస్తున్న చీఫ్ విప్ ముదునూరి

నరసాపురం: పోర్టు నిర్మాణ పనులు ప్రారంభించడానికి సోమవారం మచిలీపట్నం వచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు కలిశారు. ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో పేర్గాంచిన మొగల్తూరు మామిడి పండ్లను ఆయనకు అందించి స్వాగతం పలికారు. ఈ సమయంలో మంత్రి రోజా తదితరులు సరదాగా వ్యాఖ్యలు చేయడం, సీఎం జగన్ చిరునవ్వుతో మామిడి పండ్లను తీసుకోవడం ఆకట్టుకుంది.

బాక్సింగ్‌లో పతకాలు

విశాఖ స్పోర్ట్స్: 6వ యూత్ మెన్ అంతర జిల్లాల బాక్సింగ్ పోటీల్లో పశ్చిమగోదావరి జిల్లా క్రీడాకారులు ప్రతిభ చాటారు. డీఆర్‌ఎం కప్ పేరిట రైల్వే బాక్సింగ్ హాల్‌లో 13 వెయిట్ కేటగిరీల్లో పోటీలు నిర్వహించారు. రాష్ట్రంలోని 13 ఉమ్మడి జిల్లాలకు చెందిన యూత్ బాక్సర్లు పోటీ పడగా.. ఆయా కేటగిరీల్లో విజేతగా నిలిచిన బాక్సర్లను ఏపీ యూత్ మెన్ జట్టుగా ఎంపిక చేసి త్వరలో జరగనున్న అంతర్రాష్ట్ర మెన్ యూత్ చాంపియన్‌షిప్‌కు అర్హత కల్పించనున్నారు. 60–63.5 కిలోల లైట్ వెల్టర్ వెయిట్ కేటగిరీలో నందగోపాల్(పశ్చిమగోదావరి), వేణుమాధవ్ (శ్రీకాకుళం) ఉమ్మడిగా తృతీయ స్థానంలో నిలిచి కాంస్య పతకాలు అందుకున్నారు. అలాగే 63.5–67 కిలోల వెల్టర్ వెయిట్ కేటగిరీలో జెహథన్(పశ్చిమగోదావరి), హేమంత్ (కర్నూలు) ఉమ్మడిగా కాంస్య పతకాలు అందుకున్నారు.

డిప్యూటీ డైరెక్టర్‌గా పదోన్నతి



దాసరి నాగార్జున, డీఐపీఆర్వో

భీమవరం (ప్రకాశం చౌక్): భీమవరం సమాచార శాఖ డీఐపీఆర్వో కార్యాలయంలో సహాయ సంచాలకులుగా పని చేస్తున్న దాసరి నాగార్జునకు డిప్యూటీ డైరెక్టర్‌గా పదోన్నతి కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన డిప్యూటీ డైరెక్టర్‌గా కాకినాడ కార్యాలయానికి వెళ్లనున్నారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాల డీపీఆర్వో కార్యాలయంలో ఆయన 2019 జూలై నుంచి సహాయ సంచాలకుడిగా పనిచేస్తున్నారు. ఆయనకు పదోన్నతి రావడంపై ఉమ్మడి జిల్లా మీడియా ప్రతినిధులు, కార్యాలయ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

డ్రిప్‌పై యువతకు శిక్షణ

ఏలూరు(మెట్రో): జిల్లాలో 2023–24 ఆర్థిక సంవత్సరానికి 5 వేల హెక్టార్ల లక్ష్యంగా డ్రిప్, స్ప్రింకర్ల పరికరాలు సరఫరా చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని సూక్ష్మసేద్య పథకం పథక సంచాలకులు పీఎస్ రవి కుమార్ తెలిపారు. ఈ ఏడాది 14 మైక్రోఇరిగేషన్ కంపెనీలు ఏలూరు జిల్లాలో పనిచేస్తున్నాయన్నారు. డ్రిప్ పరికరాలు అమర్చేందుకు ఫిట్టర్స్ కొరత ఉన్నందున నిరుద్యోగులకు ఉచితంగా శిక్షణ ఇచ్చేందుకు అవకాశం ఉందన్నారు. 18 ఏళ్లు నిండిన 10వ తరగతి ఉత్తీర్ణులైన అభ్యర్థులు ఈనెల 28లోపు ఏలూరు జిల్లా సూక్ష్మసేద్య కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు సెల్ 7995009884, 7995009887 నంబర్లలో సంప్రదించవచ్చన్నారు.

30న మెగా జాబ్ ఫెయిర్

ఏలూరు(మెట్రో): చింతలపూడిలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో ఈనెల 30న మెగా జాబ్ ఫెయిర్ నిర్వహించనున్నట్టు కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ తెలిపారు. స్థానిక కలెక్టరేట్‌లో జాబ్ ఫెయిర్ వాల్‌పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, సీడాప్, జిల్లా ఉపాధి కార్యాలయం సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించనున్న జాబ్ ఫెయిర్‌లో సుమారు 18 కంపెనీల ప్రతినిధులు పాల్గొని దాదాపు 2 వేల ఉద్యోగావకాశాలు కల్పిస్తారన్నారు. ముత్తూట్ ఫైనాన్స్, టెక్ మహీంద్రా, గ్రీన్ టెక్ ఇండస్ట్రీస్, అమర్ రాజా ఇండస్ట్రీస్, అపెక్స్ సొల్యూషన్స్, మోహన్ స్పింటెక్స్ లిమిటెడ్ వంటి ప్రముఖ కంపెనీల్లో కస్టమర్ కేర్ ఎగ్జిక్యూటివ్స్, గోల్డ్‌లోన్ ఎగ్జిక్యూటివ్స్, మెషిన్ ఆపరేటర్స్, ఎలక్ట్రీషియన్స్, ఫిట్టర్స్, డెస్క్ జాబ్స్, స్టోర్ ఎగ్జిక్యూటివ్స్ వంటి ఉద్యోగావకాశాలు కల్పిస్తారన్నారు. పదో తరగతి, ఇంటర్, ఐటీఐ, పాలిటెక్నిక్, డిగ్రీ, ఇంజినీరింగ్, పీజీ వంటి విద్యార్హతలు కలిగి 18 నుంచి 35 ఏళ్ల వయసు ఉన్న వారు అర్హులన్నారు. డీఆర్‌డీఏ పథక సంచాలకుడు విజయరాజు మాట్లాడుతూ వివరాలకు 9652503799, 96663 22032, 90008 03414 సంప్రదించాలన్నారు.

సప్లిమెంటరీ పరీక్షలకు సన్నద్ధత

- ప్రభుత్వ బడుల్లో ప్రత్యేక తరగతులు
- 6,906 మంది టెన్త్ విద్యార్థులకు శిక్షణ
- నూరు శాతం ఉత్తీర్ణతే లక్ష్యం

సాక్షి, భీమవరం: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధి లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పలు చర్యలు తీసుకుంది. దీనిలో భాగంగా పదో తరగతి, ఇంటర్‌లో ఫెయిల్ అయిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తోంది. గత ప్రభుత్వాలు టెన్త్‌లో ఫెయిల్ అయిన విద్యార్థులను పెద్దగా పట్టించుకున్న దాఖలాలు లేవు. సప్లిమెంటరీ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధిస్తే వారి అదృష్టం అన్నట్టు ఉండేది. అయితే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యకు అధిక ప్రాధాన్యమివ్వడంతో సప్లిమెంటరీ పరీక్షలకు సైతం విద్యార్థులను సన్నద్ధం చేసేలా బడుల్లో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు.

లెక్కలపై ప్రత్యేక దృష్టి

జిల్లాలో గత మార్చిలో నిర్వహించిన టెన్త్ పరీక్షల్లో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు చెందిన 20,268 మంది పరీక్షలకు హాజరుకాగా 13,362 మంది ఉత్తీర్ణత సాధించారు. ప్రభుత్వ పాఠశాలలకు చెందిన 3,933 మంది బాలురు, 2,973 మంది బాలికలు ఫెయిల్ అయ్యారు. వీరికి వచ్చేనెల 2వ తేదీ నుంచి సప్లిమెంటరీ పరీక్షలు జరుగనున్నాయి. ఈ మేరకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. ఎక్కువ మంది లెక్కలు సబ్జెక్టులో ఫెయిల్ కాగా వారందరిపై ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించారు.





భీమవరం పొట్టి శ్రీరాములు మున్సిపల్ హైస్కూల్‌లో టెన్త్, రాయకుదురు హైస్కూల్‌లో ఇంటర్ విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్న దృశ్యం

ఇంటర్‌లో.. ప్రభుత్వం బాలికల కోసం ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన ఇంటర్మీడియెట్ కళాశాలల్లో కూడా ఫెయిల్ అయిన విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. జిల్లాలోని ఎంపిక చేసిన జిల్లాపరిషత్ హైస్కూళ్లలో బాలికల కోసం ఇంటర్ తరగతులు నిర్వహించారు. ఆయా కళాశాలల్లో సుమారు 150 మంది విద్యార్థినులు ఇంటర్ పరీక్షల్లో ఫెయిల్ కాగా వారందరికీ ప్రత్యేక తరగతులు నిర్వహించి సప్లిమెంటరీ పరీక్షలకు సన్నద్ధం చేస్తున్నారు.

389 పాఠశాలల్లో.. జిల్లాలోని 389 జిల్లాపరిషత్ హైస్కూళ్లలో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. రోజూ ఉదయం 8.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు విద్యార్థులను చదివిస్తున్నారు. రోజుకు రెండు సబ్జెక్టుల చొప్పున తరగతులు నిర్వహిస్తూ విద్యార్థుల సందేహాలను ఎప్పటికప్పుడు నివృత్తి చేస్తున్నారు. విద్యార్థులు గతంలో ఫెయిల్ అవడానికి కారణాలను తెలుసుకుని ఉపాధ్యాయులు దగ్గరుండి మరీ చదివిస్తూ జవాబులు రాసేటప్పుడు తప్పిదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరిస్తున్నారు. విద్యార్థులూ అంతే శ్రద్ధగా పాఠాలను అర్థం చేసుకుంటున్నారు. మొత్తంగా నూరుశాతం ఉత్తీర్ణత లక్ష్యంగా ప్రత్యేక తరగతులు జరుగుతున్నాయి.

విద్యార్థులకు వరం



పదో తరగతిలో ఫెయిల్ అయిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు ఓ వరం. విద్యార్థులు ప్రత్యేక ఆసక్తి చూపుతున్నారు. తాము కూడా తోటి విద్యార్థుల మాదిరి టెన్త్‌లో ఉత్తీర్ణత సాధించాలనే లక్ష్యంతో చదువుతున్నారు. రోజుకు రెండు సబ్జెక్టుల్లో విద్యార్థుల సందేహాలను నివృత్తి చేయడంతో పాటు క్రమశిక్షణతో వారిని చదివిస్తున్నాం. ఇది వారికెంతో మేలు చేస్తుంది.

– ఆర్.వెంకటరమణ, జిల్లా విద్యాశాఖాధికారి, భీమవరం

జిల్లా డీఆర్‌డీఏకు అవార్డు



అవార్డు అందుకుంటున్న కలెక్టర్ ప్రశాంతి

భీమవరం (ప్రకాశంచౌక్): జిల్లా డీఆర్‌డీఏ రాష్ట్ర స్థాయి అవార్డు సాధించిందని కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ అమలు, ఉన్నతి పథకం, జీవనోపాధుల రుణాల మంజూరు, 100 శాతం రికవరీ, ఎస్‌పీఏగా యూసీ సమర్పించటం, జియో ట్యాగింగ్ తదితర విషయాల్లో రాష్ట్రస్థాయిలో జిల్లా మొదటి స్థానంలో నిలిచిందన్నారు. ఈ మేరకు సెర్ప్ సీఈఓ ఎండీ ఇంతియాజ్ జిల్లాకు అవార్డును అందించారన్నారు. అవార్డు రావడానికి కృషిచేసిన డీఆర్‌డీఏ పీడీ ఎంఎస్ఎస్ వేణుగోపాల్ , జిల్లా ఉన్నతి కో–ఆర్డినేటర్ బి.రామకృష్ణ, ఏరియా కో–ఆర్డినేటర్ డి.వెంకటేశ్వరరావును కలెక్టర్ అభినందించినారు.

'పది' విద్యార్థులకు బహుమతులు

నియోజకవర్గాల వారీగా టెన్త్ ఫలితాల్లో ప్రతిభ చాటిన విద్యార్థులకు బహుమతులు అందించనున్నట్టు కలెక్టర్ తెలిపారు. కలెక్టరేట్ నుంచి సోమవారం ఆమె వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అధికారులతో సమీక్షించారు. ఈనెల 25న నియోజకవర్గ స్థాయిలో జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమంలో భాగంగా బహుమతులు అందిస్తామని, మంత్రులు, ఎమ్మెల్యేలు పాల్గొంటారన్నారు. జగనన్నకు చెబుదాంలో వచ్చిన ఫిర్యాదులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. జిల్లాలో నిర్మాణం చేపట్టని ఇళ్లు 2,657 ఉన్నాయని, చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

బాధ్యతతో అర్జీల పరిష్కారం

జేసీ రామసుందర్‌రెడ్డి

భీమవరం (ప్రకాశంచౌక్): స్పందనలో వచ్చిన ప్రతి అర్జీను అత్యంత బాధ్యతతో పరిశీలించి అర్జీదారులకు శాశ్వత పరిష్కారం చూపాలని జాయింట్ కలెక్టర్ ఎస్.రామసుందర్‌రెడ్డి అన్నారు. స్థానిక కలెక్టరేట్‌లో సోమవారం జిల్లాస్థాయి స్పందన కార్యక్రమంలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ప్రతి దరఖాస్తుకు సంతృప్తికర పరిష్కారం చూపాలన్నారు. స్పందనలో 176 దరఖాస్తులు వచ్చాయని, వాటన్నింటినీ త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. జిల్లా రెవెన్యూ అధికారి కె.కృష్ణవేణి, జిల్లా పంచాయతీ శాఖ అధికారి జీవీకే మల్లికార్జునరావు, డీఎల్‌డీఓ కేసీహెచ్ అప్పారావు, అధికారులు పాల్గొన్నారు.

అర్జీల్లో కొన్ని..

- తన పొలం సరిహద్దులో అనుమతులు లేకుండా రొయ్యల చెరువు తవ్వుతున్నారని ఆకివీడు మండలం కుప్పనపూడికి చెందిన రైతు మోటుపల్లి రాజు ఫిర్యాదు చేశారు.
- తనకున్న 2.2 ఎకరాల భూమి ఆన్‌లైన్‌లో కనిపించడం లేదని తాడేపల్లిగూడెం మండలం పట్టింపాలేనికి చెందిన అడపా రాంబాబు అనే రైతు ఫిర్యాదు చేశారు.
- తన భర్త 2020లో గుండెపోటుతో మరణించగా బీమా సొమ్ము అందలేదని, ఇప్పించాలని పాలకొల్లుకు చెందిన సబ్బే శాంతి అర్జీ అందజేశారు.
- తనకు వితంతు పింఛన్ ఇప్పించాలని మోగల్లుకు చెందిన ఎం.విజయ వినతిపత్రం అందించారు.



స్పందనలో బాధితులతో మాట్లాడుతున్న జేసీ రామసుందర్‌రెడ్డి

రెడ్‌క్రాస్ అల్పాహారం

ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో కలెక్టర్ పి.ప్రశాంతి సూచన మేరకు ప్రతి సోమవారం స్పందన అర్జీదారులకు చిరుధాన్యాలతో చేసిన అల్పాహారం, మజ్జిగ అందిస్తున్నామని జిల్లా చైర్మన్ శివ రామ భద్రిరాజు తెలిపారు. సుమారు 200 మందికి అందించామన్నారు. రెడ్‌క్రాస్ సభ్యులు కృష్ణారావు, తణుకు గవర్నమెంట్ డిగ్రీ కాలేజీ యూత్ రెడ్‌క్రాస్ వలంటీర్లు పాల్గొన్నారన్నారు.

వలంటీర్లు.. సంక్షేమ వారధులు

ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు



నరసాపురంలో వలంటీర్లను సత్కరిస్తున్న ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు

నరసాపురం: సంక్షేమ పథకాలను సకాలంలో అందిస్తూ ప్రభుత్వానికి, ప్రజలకు వారధులుగా వలంటీర్ల సేవలు నిరుపమానమని ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు అన్నారు. సోమవారం స్థానిక అల్లూరి సాంస్కృతిక కేంద్రంలో వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించారు. పట్టణంలోని 1 నుంచి 31 వరకూ ఉన్న వార్డులకు సంబంధించి వలంటీర్లను సత్కరించారు. ముఖ్య అతిథిగా చీఫ్ విప్ ముదునూరి మాట్లాడుతూ వలంటీర్ వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. పలు రాష్ట్రాలు కూడా ఈ దిశగా ఆలోచిస్తున్నాయన్నారు. ప్రజలకు మెరుగైన పాలన అందించడంతో పాటు మహాత్ముడు కలల గన్న గ్రామ స్వరాజ్య సాకారానికి సీఎం జగన్ వలంటీర్, సచివాలయ వ్యవస్థలను తీసుకు వచ్చారన్నారు. వలంటీర్లు వారికి కేటాయించిన కుటుంబాలకు పెద్దదిక్కుగా మారారన్నారు. కరోనా విపత్తు, వరదలు, తుపానుల సమయంలో వలంటీర్ల సేవలు అపురూపమని కొనియాడారు. ప్రభుత్వ బలగం వలంటీర్లు అని అన్నారు. వలంటీర్లను హేళన చేసిన ప్రతిపక్ష నేత ఈ రోజు వారు ప్రజల్లో మమేకమైన తీరును చూసి సిగ్గుపడుతున్నారన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ మాట్లాడుతూ వలంటీర్, సచివాలయ వ్యవస్థ ద్వారా యువతకు పెద్ద ఎత్తున ప్రభుత్వం ఉపాధి అవకాశాలు కల్పించిందన్నారు. మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ కామన నాగిని మాట్లాడుతూ వలంటీర్ల ద్వారా నేరుగా సంక్షేమ పథకాలు అర్హులకు అందుతున్నాయన్నారు. రాష్ట్ర కనీస వేతనాల సలహా మండలి చైర్‌పర్సన్ బర్రి లీల, వన్నెకుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ బందన పూర్ణ చంద్రరావు, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు బూసరపు జయ, కౌన్సిలర్ అడిదల శ్యామల, మత్స్యకార నేత మల్లాడి బుజ్జి మాట్లాడారు. మున్సిపల్ కమిషనర్ కె.వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జెడ్పీటీసీ బొక్కా రాధాకృష్ణ, ఏఎంసీ చైర్మన్ గుబ్బల రారాధాకృష్ణ, కౌన్సిలర్లు సోమరాజు దుర్గాభవానీ, పతివాడ పత్మ, సిర్రా కాంతమ్మ, సఖినేటిపల్లి సురేష్, చిట్టూరి కృష్ణ, ద్వారా గంగాభవానీ, కావలి రామసీత, షేక్ అబేధాసుల్తానా పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలందించాలి

కలెక్టర్ ప్రశాంతి

తణుకు అర్బన్: అత్యవసర పరిస్థితుల్లో నాణ్యమైన సత్వర వైద్యసేవలందించి జీరో మరణాల శాతాన్ని నమోదు చేసేందుకు కృషి చేయాలని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. సోమవారం తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రిలో మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్లు, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లకు ఆరు రోజులపాటు నిర్వహించే శిక్షణ తరగతులను ఆమె ప్రారంభించి మాట్లాడారు. ముఖ్యంగా రోడ్డు ప్రమాదాలు, పాము కాటు వంటి ఘటనల్లో వైద్య సేవలందించడంలో మెలకువలను అందిపుచ్చుకోవాలని సూచించారు. జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ డి.మహేశ్వరరావు మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్లు, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు 346 మంది ఉన్నారని, ఐదు రోజులు ఇక్కడ, 27న భీమవరం విష్ణు డెంటల్ కాలేజీలో శిక్షణ ఇస్తామన్నారు. ప్రధానంగా గుండె ఆగినప్పుడు సీపీఆర్ చేయడం, స్పందించాల్సిన తీరుతో ప్రాణాలను కాపాడటంపై అవగాహన కల్పిస్తామన్నారు. రాష్ట్ర గణాంక శాఖ డిప్యూటీ డైరెక్టర్ శివశంకర్‌బాబు, తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రి ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ వెలగల అరుణ, డీపీఎంఓ డాక్టర్ సుగుణరాజు, నోడల్ ఆఫీసర్ డాక్టర్ కీర్తి, తహసీల్దార్ పీఎన్‌డీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



శిక్షణ తరగతులు ప్రారంభిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

ముఖ్యమంత్రికి పోలీస్ సిబ్బంది కృతజ్ఞతలు



సీఎం జగన్‌ను కలిసిన పోలీస్ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు నాగేశ్వరరావు

ఏలూరు టౌన్: రాష్ట్రంలోని పోలీస్ సిబ్బందికి రావాల్సిన మూడు సరెండర్ లీవ్స్‌కు సంబంధించి నగదును మంజూరు చేయటంపై హర్షం వ్యక్తం చేస్తున్నామని, పోలీస్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు చెబుతున్నామని పోలీస్ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు ఆర్.నాగేశ్వరరావు అన్నారు. సోమవారం సీఎం జగన్‌ను రాష్ట్ర పోలీస్ అధికారుల సంఘం నాయకులు కలిసి కృతజ్ఞతలు తెలిపారు. పెండింగ్‌లోని తమ సమస్యలను సైతం ముఖ్యమంత్రి వైఎస్ జగన్ దృష్టికి తీసుకువెళ్లగా ఆయన సానుకూలంగా స్పందిస్తూ పరిష్కారానికి ప్రత్యేక శ్రద్ధ వహిస్తానని హామీ ఇవ్వటంపై సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు జిల్లా అధ్యక్షుడు నాగేశ్వరరావు మాట్లాడుతూ మూడు సరెండర్ లీవ్స్‌కు సంబంధించి రూ.554 కోట్ల నిధులను ఒకేసారి ప్రభుత్వం విడుదల చేయటం అభినందనీయమన్నారు. దీంతో రాష్ట్రవ్యాప్తంగా సుమారు 60 వేల మంది పోలీస్ కుటుంబాల్లో ఆనందం వెల్లివిరిస్తోందన్నారు. అలాగే పెండింగ్‌లోని అలవెన్సులు, డీఏ బకాయిలు, సర్వీసు సంబంధిత సమస్యలను సైతం పరిష్కరిస్తామనీ, త్వరలోనే ఒక ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేస్తామని సీఎం చెప్పారన్నారు. ఆర్థికపరమైన ప్రతి సమస్యను పరిష్కరిస్తానని స్వయంగా ముఖ్యమంత్రి చెప్పటం అభినందనీయమన్నారు.

ఓపెన్ స్కూల్ ఫలితాలు విడుదల

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం (ఓపెన్ స్కూల్) 10వ తరగతి, ఇంటర్మీడియట్ కోర్సుల పరీక్షా ఫలితాలు సోమవారం విడుదలయ్యాయని జిల్లా విద్యాశాఖాధికారి ఎన్‌వీ రవిసాగర్ ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాలో పదో తరగతిలో 1,247 మందికి 167 మంది, ఇంటర్‌లో 2,276 మందికి 864 మంది ఉత్తీర్ణులయ్యారని పేర్కొన్నారు. టెన్త్‌లో 13.39 శాతం, ఇంటర్‌లో 37.96 శాతం ఉత్తీర్ణత నమోదయ్యిందని పేర్కొన్నారు. రీ వెరిఫికేషన్, రీ కౌంటింగ్ కోసం ఈనెల 30లోపు ఫీజులు చెల్లించవచ్చని తెలిపారు. అనుత్తీర్ణులైన అభ్యర్థులకు పబ్లిక్ పరీక్షలు జూన్ 26 నుంచి జూలై 4 వరకూ, ప్రయోగ పరీక్షలు జూలై 5 నుంచి 7వ వరకు నిర్వహిస్తారని పేర్కొన్నారు. సబ్జెక్టుకు 10వ తరగతి అభ్యర్థులు రూ.100, ఇంటర్ అభ్యర్థులు రూ.150, ప్రయోగ పరీక్షలకు రూ.100 చొప్పున ఈనెల 25లోపు ఆన్‌లైన్‌లో చెల్లించాలని తెలిపారు. అపరాధ రుసుం రూ.25తో ఈనెల 26వ తేదీ నుంచి 29 వరకూ, రూ.50తో ఈనెల 30, 31 తేదీల్లో ఫీజులు చెల్లించవచ్చని సూచించారు. తత్కాల్ పద్ధతిలో 10వ తరగతికి రూ.500, ఇంటర్‌కు రూ.1,000 అపరాధ రుసుంతో జూన్ 1, 2 తేదీల్లో ఫీజులు చెల్లించవచ్చని వివరించారు.

సత్వర పరిష్కారానికి కృషి

సాక్షి, భీమవరం: స్పందన కార్యక్రమంలో వచ్చిన ఫిర్యాదుల సత్వర పరిష్కారానికి కృషిచేస్తామని జిల్లా ఎస్పీ యు.రవిప్రకాష్ అన్నారు. స్థానిక డీఎస్పీ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమంలో భాగంగా 18 మంది బాధితులు ఆయనకు ఫిర్యాదులు అందజేశారు. కట్నం వేధింపులు, సరిహద్దు గొడవలు, సివిల్ వివాదాలకు సంబంధించి ఫిర్యాదులు ఎక్కువగా ఉన్నాయి.

ఫిర్యాదుల్లో కొన్ని..

- భీమవరం టూటౌన్ ప్రాంతానికి చెందిన 70 ఏళ్ల వృద్ధురాలు కార్యాలయానికి రాగా ఎస్పీ ఆమె వద్దకే వెళ్లి సమస్య తెలుసుకున్నారు. తన కోడలు తన సొమ్ములు తీసుకుని ఇవ్వకపోగా ఇంట్లోకి రానివ్వడం లేదని ఎస్పీ వద్ద ఆమె ఆవేదన వ్యక్తం చేసింది. తక్షణమే స్పందించిన ఎస్పీ సంబంధిత పోలీసు అధికారితో ఫోన్‌లో మాట్లాడి సమస్య పరిష్కరించాలని ఆదేశించారు.
- ప్రేమ వివాహంలో తన మనవడు జోక్యం చేసుకున్నాడని తెలిసి వారి బంధువులు దాడి చేశారని, స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని పెనుమంట్రకు చెందిన మహిళ ఎస్పీ దృష్టికి తీసుకువచ్చారు.
- తాడేపల్లిగూడెం మండలానికి చెందిన వ్యక్తి తన కుమార్తె కనిపించడం లేదని ఏప్రిల్‌లో పోలీసులకు ఫిర్యాదు చేసినా ఇప్పటికీ ఆచూకీ తెలియరాలేదని వాపోయారు.
- కాళ్లకు చెందిన మహిళ తన భర్త తనను కాపురానికి తీసుకువెళ్లకపోగా అధిక కట్నం కోసం వేధిస్తున్నారని ఫిర్యాదు చేశారు.



ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ రవిప్రకాష్

పోలీసు వెల్ఫేర్ ఆస్పత్రి సందర్శన

పట్టణంలోని పోలీస్ క్వార్టర్స్‌లో ఏర్పాటుచేసిన పోలీస్ వెల్ఫేర్ ఆస్పత్రిని ఎస్పీ రవిప్రకాష్ సందర్శించారు. పోలీసు సిబ్బందికి ఎటువంటి చికిత్స అందిస్తున్నారనే విషయంపై ఆరా తీశారు. అనంతరం ఆయన సామాన్య వైద్య పరీక్షలు చేయించుకున్నారు.

క్లుప్తంగా

పోలవరం ప్రాజెక్టు ప్రాంతంలో లారీ దగ్ధం


ప్రాజెక్టు ప్రాంతంలో దగ్ధమవుతున్న లారీ

పోలవరం రూరల్: ఏలూరు జిల్లా పోలవరం ప్రాజెక్టు నిర్మాణ ప్రాంతంలో సోమవారం ప్రమాదవశాత్తూ ఒక లారీ దగ్ధమైంది. ప్రాజెక్టు ప్రాంతంలోకి ఇసుక లోడ్‌తో వెళుతున్న ఒక సబ్ కాంట్రాక్టర్‌కు చెందిన లారీలో బ్యాటరీ వైర్లు షార్ట్ సర్క్యూట్ కావడంతో ఒక్కసారిగా మంటలు చెలరేగి లారీ దగ్ధమైంది. ఈ సంఘటనలో డ్రైవర్ అప్రమత్తమై లారీ నుంచి దూకేయడంతో ప్రమాదం నుంచి బయటపడ్డాడు. అక్కడ పనిచేస్తున్నవారు సమీపంలో ఉన్న వాటర్ ట్యాంకర్ల ద్వారా మంటలను అదుపు చేశారు.

కేరళ చండా మేళంకు క్రేజ్

- యువతకు ఉపాధి మార్గంగా కేరళ డప్పులు
- ఉమ్మడి పశ్చిమగోదావరిలో విస్తరిస్తున్న వైనం


పోతవరం కేరళ చండా మేళం బృందం


కేరళ మేళం ప్రదర్శిస్తున్న కళాకారులు

కైకలూరు: తెల్లటి పంచె.. మెడలో రుద్రాక్షమాల.. నుదిటిపై గంధపు బొట్టు.. నీలం తువాలకు వేలాడే డ్రమ్స్.. కొందరి చేతుల్లో తాళాలు.. లయబద్ధంగా వాయిస్తుంటే ఆ ప్రాంతం దద్దరిల్లిపోతోంది. ఇది కేరళ చండా మేళంలో ప్రత్యేకత. ఇటీవల హిందూ దేవాలయాల ఉత్సవాలు, వివాహాల్లో ప్రత్యేక ఆకర్షణగా ఈ మేళం నిలుస్తోంది. కేరళలో ప్రత్యేకత సంతరించుకున్న ఈ మేళాన్ని గ్రామాల్లో యువకులు యూట్యూబ్‌లో సాధన చేసి గ్రూపుగా ఏర్పడి ఉపాధి మార్గంగా మార్చుకుంటున్నారు.

తీన్మార్ స్థానంలో కేరళ డప్పులు

ఉత్సవాల్లో తీన్మార్ డప్పులు ఉర్రూతలూగించేవి. వాటి స్థానాన్ని కేరళా చండామేళం ఆక్రమిస్తోంది. పలు కార్యక్రమాలలో దీనిని ఏర్పాటు చేయడానికి ఎక్కువ మంది ఆసక్తి చూపుతున్నారు. ఈ మేళం ధ్వని ఒకరకమైన భక్తిభావాన్ని మనసులో నింపుతోంది. గతంలో అయ్యప్పస్వామి భజనలకు ప్రత్యేకంగా కేరళ నుంచి తీసుకొచ్చేవారు. ఖర్చు ఎక్కువయ్యేది. నేడు పలు ప్రాంతాల్లో యువకులు చండా మేళాన్ని నేర్చుకుని కేరళ వేషధారణలో ప్రదర్శిస్తున్నారు. ఏడాదిన్నరగా మేళం జట్లు పెరుగుతున్నాయి. కేరళ సంప్రదాయాన్ని గుర్తుతెచ్చేలా కథాకళి వేషధారణలతో నృత్యాలు ప్రదర్శిస్తున్నారు.

నెలకు 15 ప్రదర్శనలు

పశ్చిమగోదావరి జిల్లా నల్లజర్ల మండలం పోతవరంకు చెందిన పేదవేగి వెంకట వరప్రసాద్ బీకాం చదివారు. ఏడాదిన్నర నుంచి కేరళ చండా మేళాన్ని సహచరులతో కలసి ఏర్పాటు చేసుకున్నాడు. ప్రస్తుతం నెలకు 15 ప్రదర్శనలు ఇస్తున్నారు. వీరి జట్లలో బీటెక్, డిగ్రీలు చదువుతున్న యువత ఉన్నారు. ఒక్కొక్కరికి దాదాపు 10 ప్రదర్శనలకు రూ.20 వేలు అందుతున్నాయి. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో పోతవరం, పిప్పర, ముక్తేశ్వరం, వీరవాసరంతో పాటు పాలకొల్లు, కాకినాడ ఇలా పలు ప్రాంతాల్లో స్థానికంగా చండా మేళ బృందాలు తయారవుతున్నాయి.

కేరళలో 300 సంవత్సరాలకుపైగా చండా మేళం అత్యంత ప్రజాదారణ పొందుతోంది. మొత్తం 15 మంది సభ్యుల్లో 10 మంది డ్రమ్స్, ఐదుగురు తాళాలు వాయిస్తారు. కేరళలో పెరువెంబు, నెమ్మర, లక్కిజి, వెల్లర్కాజ్, వలప్పాయి గ్రామాల్లో పెరుంకొల్లన్ కుటుంబాలు ఈ డప్పులు తయారు చేస్తారు. ఆవు చర్మంతో తయారు చేసిన డ్రమ్ములకు పనించి మరమ్ అనే చెట్టు విత్తనం నుంచి తయారు చేసిన చెక్క ఉంగరాలను తాడులకు తొడుగుతారు.

కేరళలో వాద్యాల కొనుగోలు



చండా మేళం ద్వారా అనేక మంది ఉపాధి పొందుతున్నారు. ఒక జట్టును తయారి చేయడానికి రూ.4 లక్షలు ఖర్చు అవుతోంది. వాద్య పరికరాలను కేరళలో కొనుగోలు చేస్తాం. ఒక్కో ప్రోగ్రాంకు రూ.50 వేలకు పైగా తీసుకుంటాం. వాహనంలో 15 మంది జట్టుగా వెళతాం. సంప్రదాయ దుస్తులు ధరించిన తర్వాత ఎంతో నిష్ఠతో వ్యవహరిస్తాం. – పవీ వరప్రసాద్, టీం మేనేజరు, పోతవరం.

ఉత్సవాల్లో ప్రదర్శనలు



కేరళ చండా మేళంలో ధ్వని భక్తి భావాన్ని నింపుతోంది. ఇటీవల దేవాలయాల ఉత్సవాలకు ఈ మేళంతో ప్రదర్శన ఇప్పించాం. జట్టు సభ్యులు ధరించే సంప్రదాయ దుస్తులు ఎంతో ఆకట్టుకుంటున్నాయి. అమ్మవారి ఊరేగింపు సమయంలో ఈ వాద్యం ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. – వీఎన్‌కే.శేఖర్, శ్యామలాంబ ఆలయ ఈవో, కైకలూరు.

● గడపగడపకు సంక్షేమం


పాలకోడేరు: మండలంలోని వేంద్రలో ప్రభుత్వ పథకాల గురించి వివరిస్తున్న డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నరసింహారాజు, చిత్రంలో ఎంపీపీ చంటి రాజు

చంద్రబాబు పేదలకు క్షమాపణ చెప్పాలి

ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్


పాలకొల్లులో చంద్రబాబు దిష్టిబొమ్మ దహనం చేస్తున్న ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్

పాలకొల్లు అర్బన్: పేదల ఇంటి స్థలాల పంపిణీ విషయంలో చంద్రబాబు నాయుడు చేసిన వ్యాఖ్యలు అప్రజాస్వామికమని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్, ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్ ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణం తన వ్యాఖ్యలు వెనక్కి తీసుకుని చంద్రబాబు పేదలకు బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. రాజధాని ప్రాంతంలో పేదలకు ఇచ్చిన భూమిలో శవాన్ని పూడ్చుకోవడానికి కూడా చాలదని చంద్రబాబు వ్యాఖ్యానించడం పేదల ఆత్మాభిమానాన్ని దెబ్బతీయడమేనని శ్రీనివాస్ దుయ్యబట్టారు. 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా చేసిన చంద్రబాబు ఒక్క సెంటు భూమి కూడా పేదలకు పంచలేదని విమర్శించారు. దివంగత ముఖ్యమంత్రి రాజశేఖర రెడ్డి హయాంలో సేకరించిన స్థలాల్లో టిడ్కో ఇళ్ల పేరుతో పేదలను బ్యాంకులకు తాకట్టుపెట్టిన ఘనత చంద్రబాబుదని గుర్తు చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 32 లక్షల మందికి ఇంటి స్థలాలిచ్చి గృహాలు నిర్మించి పేదల పక్షపాతిగా సీఎం జగన్ నిలిచారన్నారు.

చంద్రబాబు దిష్టిబొమ్మ దహనం

ముందుగా ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్ ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పార్టీ కార్యాలయం నుంచి పాదయాత్రగా గాంధీబొమ్మల సెంటర్‌కి చేరుకున్నారు. చంద్రబాబుకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం దిష్టిబొమ్మ దహనం చేశారు. అక్కడ నుంచి పెదగోపురం వరకు నిరసన ప్రదర్శన చేశారు. చంద్రబాబుకి మంచి బుద్ధి కలుగజేయాలని కోరుతూ క్షేత్రపాలకుడు శ్రీ క్షీరారామలింగేశ్వరస్వామికి కొబ్బరికాయలు కొట్టారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ గోవిందరాజుల నాయుడు, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ యడ్ల తాతాజీ, ఎంపీపీ సబ్బితి సుమంగళి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మైఖేల్‌రాజు, రాష్ట్ర కార్యదర్శి డీటీడీసీ బాబు, యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు వినిస్టన్ బాబు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఖండవల్లి వాసు, చిట్టూరి ఏడుకొండలు, రావూరి వెంకటరమణ, బండి సుందరరామమూర్తి, పోడూరు వైస్‌ఎంపీపీ గుబ్బల సత్యనారాయణ, మండల సర్పంచ్‌ల చాంబర్ అధ్యక్షుడు గుమ్మాపు పెద్దిరాజు, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు చినిమిల్లి గణపతిరావు, చెన్ను విజయ్, హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ పెదపాటి పెద్దిరాజు తదితరులు పాల్గొన్నారు.

బంగారంపేటలో సాయిరాం శంకర్ సినిమా


పోలవరం బంగారంపేట వద్ద తొలి సన్నివేశానికి క్లాప్ కొడుతున్న ఎంపీపీ వెంకటరెడ్డి

పోలవరం రూరల్: వీఎస్ఆర్ క్రియేషన్స్ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న చిత్రానికి సంబంధించి పోలవరం గ్రామంలోని బంగారంపేట కనకదుర్గమ్మ ఆలయం వద్ద సోమవారం పూజలు నిర్వహించి షూటింగ్ ప్రారంభించారు. హీరో సాయిరామ్‌శంకర్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎంపీపీ సుంకర వెంకటరెడ్డి క్లాప్ కొట్టగా, దర్శకుడు జూరెడ్డి సత్యప్రకాష్ తొలి సన్నివేశాన్ని చిత్రీకరించారు. ఈ సందర్భంగా హీరో సాయిరామ్ శంకర్, దర్శకుడు జూరెడ్డి సత్యప్రకాష్‌లు విలేకరులతో మాట్లాడుతూ 1955 – 58 ప్రాంతంలో పోలవరం గ్రామంలో జరిగిన యధార్థ ఘటనకు సంబంధించి కథ రూపొందించామన్నారు. విలేజ్ యాక్షన్ సబ్జెక్ట్‌గా ఉంటుందన్నారు. త్వరలో టైటిల్ ప్రకటిస్తామన్నారు. ఈ చిత్రానికి మాస్ట్రో ఇళయరాజా సంగీతాన్ని అందిస్తున్నారని తెలిపారు. డైరెక్టర్ వంశీ సహకారం అందిస్తున్నారని వారు పేర్కొన్నారు. జూన్ నుంచి 40 రోజుల పాటు మొదటి షెడ్యూల్ పోలవరం ప్రాంతంలో నిర్వహిస్తామన్నారు. తన స్వగ్రామమైన బంగారంపేటలో తన తొలిచిత్రం, తొలి షెడ్యూల్‌ను ప్రారంభించడం అదృష్టంగా భావిస్తున్నట్లు చిత్ర దర్శకుడు జూరెడ్డి సత్యప్రకాష్ తెలిపారు. కార్యక్రమంలో జడ్పీటీసీ కలుం హేమకుమారి, మైగాపుల దుర్గాప్రసాద్, జూరెడ్డి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మద్ది హుండీ ఆదాయం లెక్కింపు

జంగారెడ్డిగూడెం రూరల్: జంగారెడ్డిగూడెం మండలంలోని గురవాయిగూడెం శ్రీమద్ది ఆంజనేయస్వామి దేవస్థానం హుండీ ఆదాయాన్ని సోమవారం లెక్కించారు. 67 రోజులకు వచ్చిన ఆదాయాన్ని లెక్కించగా రూ: 40,08,351 ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈవో తెలిపారు. దేవదాయ శాఖ తనిఖీదారు(తాడేపల్లిగూడెం) ఎ.సుజన్ కుమార్ పర్యవేక్షణలో ఆదాయాన్ని లెక్కించారు.

సాంబయ్య సేవలు వెలకట్టలేం


'ఆనందమయ జీవితానికి అద్భుత పరిష్కారాలు' పుస్తకాన్ని ఆవిష్కరించిన పెద్దలు

ఏలూరు రూరల్: వాస్తు శాస్త్రంలో ఆచార్య పరిమి సాంబయ్య చేసిన కృషి వెలకట్టలేమని కేంద్రీయ విశ్వవిద్యాలయం తెలుగు శాఖాధ్యక్షుడు డాక్టర్ పి.రామనరసింహం అన్నారు. సోమవారం ఏలూరు అతిథి హోటల్‌లో పరిమి సాంబయ్య ఆలోచనలతో రూపొందిన ఆనందమయ జీవితానికి అద్భుత పరిష్కారాలు అనే పుస్తక అవిష్కరణ జరిగింది. ఈ సందర్భంగా రామనరసింహం మాట్లాడుతూ జ్యోతిష్యం, సంఖ్యాశాస్త్రం, వాస్తుతో సాంబయ్య ప్రజల ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారం చూపారని కొనియాడారు. రచన జర్నలిజం కళాశాల ప్రిన్సిపాల్ గోవిందరాజులు, చక్రధర్, సెయింట్‌థెరిస్సా కళాశాల రిటైర్డ్ అధ్యాపకురాలు డాక్టర్ పి.భాగ్యలక్ష్మి, జయేంద్రశర్మ, పి.ఫణిచందర్, శ్రీశ్రీశర్మ, డీవీ సుబ్బారావు, తుమ్మెర రామారావు, రవిశర్మ తదితరులు పాల్గొని సాంబయ్య సేవలను వివరించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి


మృతుడు నాగరాజు(68)

భీమడోలు: అప్పుల విషయంలో గొడవపడి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన యారపుత్తూరు నాగరాజు(68) విజయవాడ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం తెల్లవారుజామున మృతి చెందాడు. ఈ గొడవలో ఇప్పటికే కొడుకు మృతి చెందిన సంగతి తెలిసిందే. ఈ నెల 14న పూళ్ల పంచాయతీ శివారు సాయన్నపాలేనికి చెందిన తండ్రీకొడుకులు నాగరాజు, సూర్యనారాయణరాజు మధ్య వ్యవసాయానికి చేసిన అప్పుల విషయంలో గొడవ జరిగింది. వారిద్దరు ఇంట్లోనే పురుగులమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డారు. కొడుకు సూర్యనారాయణరాజు(35) ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రిలో మృతి చెందగా.. అపస్మారక స్థితిలో ఉన్న నాగరాజుకు ఏలూరులో వైద్య సేవలందించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన చికిత్స నిమిత్తం విజయవాడ తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఇద్దరి మృతితో విషాదఛాయలు అలుముకున్నాయి.

ఈఏపీ సెట్ పరీక్షకు 2,813 మంది హాజరు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): రాష్ట్రంలో అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాల నిమిత్తం నిర్వహించే ఏపీ ఈఏపీ సెట్ పరీక్షల్లో సోమవారం ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లాలోని 10 పరీక్షా కేంద్రాల్లో మొత్తం 3,011 మందికి 2,813 మంది హాజరయ్యారు. ఏలూరు జిల్లాలో సిద్ధార్థ క్వెస్ట్ సెంటర్‌లో పరీక్షల్లో ఉదయం 182 మందికి గాను 172 మంది, మధ్యాహ్నం 181 మందికి 172 మంది హాజరయ్యారు. ఏలూరు ఇంజనీరింగ్ కళాశాలలో ఉదయం 139 మందికి 135 మంది, మధ్యాహ్నం 139 మందికి 131 మంది.. సీఆర్‌ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఉదయం 150 మందికి 143 మంది, మధ్యాహ్నం 150 మందికి 142 మంది హాజరయ్యారు. పశ్చిమలో 7 పరీక్షా కేంద్రాల్లో ఉదయం 1,035 మందికి 960 మంది హాజరు కాగా మధ్యాహ్నం 1035 మందికి 958 మంది హాజరయ్యారు.

ఆస్పత్రిలో అవినీతికి చెక్

- అక్రమార్కుల గుండెల్లో పరిగెడుతున్న రైళ్లు
- తణుకు ప్రభుత్వాసుపత్రిలో నలుగురు సిబ్బంది తొలగింపు
- సర్వత్రా ప్రశంసలు



తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రి

తణుకు అర్బన్: తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రిలో ఒకేసారి నలుగురు వైద్యసిబ్బందిని తొలగించడంతో లంచావతారాల గుండెల్లో రైళ్లు పరిగెత్తాయి. ఆస్పత్రిలో పనిచేస్తున్న ముగ్గురు అవుట్ సోర్సింగ్ సిబ్బందితోపాటు ఒక రెగ్యులర్ ఉద్యోగి పేద రోగుల నుంచి డబ్బుల తీసుకున్నారనే ఆరోపణలు నిర్ధారణ కావడంతో వారిని విధుల నుంచి తొలగించిన విషయం తెలిసిందే. గతంలో ఎన్నడూ లేని విధంగా ఒకేసారి నలుగురు సిబ్బందిని తొలగించడం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వ ఆస్పత్రుల్లో నాణ్యమైన ఉచిత వైద్యసేవలు పేద వర్గాలకు సత్వరమే అందాలనే ఆశయంతో ఎప్పటికప్పుడు ప్రణాళికలు రచించి అమలు చేస్తుంటే కొందరు అక్రమార్కుల కారణంగా ఆ వైద్యసేవలు పేదవర్గాల జేబులకు చిల్లులు పెడుతున్నాయి. వైఎస్సార్ ఆరోగ్యశ్రీలో సైతం 2వేలకు పైగా వైద్యసేవలను అందుబాటులోకి తీసుకువచ్చి నాడు– నేడు ద్వారా ఆస్పత్రి రూపరేఖలు మారుస్తున్న తరుణంలో లంచగొండిల పాత్రతో వైద్యసేవలను తప్పుపట్టే పరిస్థితి దాపురించింది. సమస్యను గుర్తించిన రాష్ట్ర మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అభివృద్ధి కమిటీతోపాటు ఆస్పత్రిలో ప్రత్యేక నిఘా ఏర్పాటుచేసి లంచగొండిలపై కొరడా ఝుళిపించారు. దీంతో తణుకు ప్రజానీకం సైతం ప్రశంసలు కురిపిస్తున్నారు.

సేవల్లో అగ్రభాగాన తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రి

తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రి చుట్టుపక్కల ఉన్న 100 గ్రామాలకు పెద్దదిక్కుగా 150 పడకలతో అన్ని విభాగాల్లోనూ విశేష సేవలందిస్తోంది. ఇందుకుగాను రాష్ట్రంలోని మిగిలిన జిల్లా ఆస్పత్రుల కంటే ముందు వరసలో ఉంటూ పలు అవార్డులు సొంతం చేసుకుంటోంది. 450 పడకలున్న ఆస్పత్రులను సైతం దాటి ఇటీవలే ఎన్‌క్వాస్, లక్ష్య వంటి అవార్డులను తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రికి వరించాయి. అటువంటి ఆస్పత్రిలో చీడపురుగుల్లా దాపురించిన లంచగొండిలను ఏరిపారేసే దిశగా మంత్రి కారుమూరి ప్రత్యేక కార్యాచరణ చేపట్టారు. దీంతో ప్రస్తుతం పేదరోగుల నుంచి సిబ్బంది రూపాయి దండుకోవాలంటే దడపుట్టే పరిస్థితి నెలకొంది.

నేరుగా నాకు తెలపండి



తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రిలో ఎటువంటి అవినీతికి తావులేకుండా వైద్యసేవలందించేలా కార్యాచరణ చేశాం. ఆస్పత్రి సిబ్బంది ఎవరైనా డబ్బులు డిమాండ్ చేస్తే నేరుగా నాకు తెలపవచ్చు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ ఆస్పత్రులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి రూపురేఖలు మార్చారు. పేదవర్గాలందరికీ నాణ్యమైన వైద్యం ఉచితంగా అందించే దిశగా పరిపాలన చేస్తున్నారు. అన్ని విభాగాల్లోనూ కావాల్సిన మౌలిక వసతులతో పాటు వైద్యులు, సిబ్బంది నియామకాలు పూర్తి చేశారు.

– కారుమూరి వెంకట నాగేశ్వరరావు, రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి

24న రంగస్థల కళాకారుల సంక్షేమ సంఘ సమావేశం

తాడేపల్లిగూడెం (టీఓసీ): తాడేపల్లిగూడెం రంగస్థల కళాకారుల సంక్షేమ సంఘం 132వ నెలవారీ సభా కార్యక్రమం ఈ నెల 24వ తేదీన బుధవారం సాయంత్రం గీతా మందిరంలో నిర్వహిస్తున్నట్లు సంఘ నాయకులు వంశీకృష్ణ, మురళీ కృష్ణలు వెల్లడించారు. బీసీ సంక్షేమ సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు కేశవభట్ల విజయ్‌కు గౌరవ సత్కారం, కస్పా పెంటపాడుకి చెందిన రచయిత, దర్శకుడు కొపల్లే శ్రీనివాస్‌కు ఏకపాత్రాభినయ కళా బ్రహ్మ బిరుదుతో కళా సత్కారం, చిత్ర కళా ఉపాధ్యాయుడు షేక్ హజరత్ వలీకి ఉత్తమ ఉద్యోగ పురస్కారం, పేద కళాకారిణి బోయిన గంగాజలం వాణికి ఆర్థిక సత్కారం జరుగుతుందని, సభలో వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారని తెలిపారు.

స్పందనకు రెండు అర్జీలు

తాడేపల్లిగూడెం రూరల్: తాడేపల్లిగూడెం తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రెవెన్యూ, ఆర్‌అండ్‌బీ శాఖలకు ఒక్కో అర్జీ అందినట్లు ఇన్‌ఛార్జ్ ఎంపీడీవో వీఎస్.వేణుగోపాల్ వివరించారు. తహసీల్దార్ వైకేవీ.అప్పారావు, ఇన్‌ఛార్జ్ ఎంపీడీవో వేణుగోపాల్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

చలివేంద్రం ప్రారంభం


తణుకులో చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న వాసవి వైభవం క్లబ్ సభ్యులు

తణుకు టౌన్: తణుకు వాసవీ క్లబ్స్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో తణుకు వాసవి వనితా వైభవం క్లబ్ నిర్వహణలో తణుకులో చలివేంద్రాన్ని ప్రారంభించారు. సోమవారం తణుకులోని ఎస్ఎస్‌సీ బోస్ రోడ్డులోని వాసవీ ప్లాజా వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని జోన్ ఆఫీసర్ గుడిమెట్ల రాజేశ్వరరావు ప్రారంభించినట్లు క్లబ్ అధ్యక్షురాలు ఆకుల వేదకుమారి తెలిపారు. ఈ కార్యక్రమంలో పాదచారులకు, వాహనదారులకు మజ్జిగను పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి జల్లూరి సుజాత, జగదీష్, రాయల్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు, కోశాధికారి ఇతర సభ్యులు పాల్గొన్నారు.

నేడు వలంటీర్లకు సత్కారం

మొగల్తూరు: మండలంలోని 20 సచివాలయాల పరిధిలో ఉన్న వలంటీర్లను మంగళవారం సత్కరించనున్నట్టు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కర్రి ఏసుబాబు తెలిపారు. నరసాపురం మండలం పసలదీవిలోని పులపర్తివారి సంప్రదాయ కల్యాణ మండపంలో ఏర్పాటు చేసే సత్కార కార్యక్రమానికి ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు ముఖ్యఅతిథిగా పాల్గొంటారని, ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులంతా హాజరుకావాలని ఆయన కోరారు.

ముత్యాలమ్మవారి హుండీ ఆదాయం రూ.12 లక్షలు

మొగల్తూరు: మండలంలోని ముత్యాలపల్లి బండి ముత్యాలమ్మవారి హుండీ ఆదాయం 55 రోజులకు రూ.12,65,114 లభించినట్టు భీమవరం సుబ్రహ్మణ్యేశ్వర సామి ఆలయం ఈఓ డి.రామకృష్ణంరాజు తెలిపారు. సోమవారం హుండీ ఆదాయం లెక్కింపును ఆయన పర్యవేక్షించారు. కార్యక్రమంలో ఆల య చైర్మన్ కొల్లాటి రామారావు, పాలకవర్గ సభ్యు లు, మాజీ చైర్మన్‌లు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఫ్లెక్సీ చించివేతపై ఫిర్యాదు

పాలకొల్లు అర్బన్: వైఎస్సార్‌సీపీ ఫ్లెక్సీలు చించివేస్తోన్న అగంతకులను గుర్తించి, వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వైఎస్సార్‌సీపీ నాయకులు సోమవారం పాలకొల్లు పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై బాదం శ్రీనివాస్‌కి ఫిర్యాదు చేశారు. గాంధీబొమ్మల సెంటర్, దాసరి నారాయణరావు వంతెన, చినగోపురం వద్ద ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను చించివేశారని పేర్కొన్నారు. రాష్ట్ర యువజన ప్రధాన కార్యదర్శి ఖండవల్లి వాసు, మోర్త గిరీష్, పీటర్‌సన్ చిన్ని, తలుపుల భుజంగరావు, బండి రమేష్, రేలంగి నరసింహారావు (దున్ను), సత్యప్రసాద్, జమ్ము కాశీ, అప్పారి నాగరాజు, గేదెల నరసింహరావు, లోపింటి చిరంజీవి, పెంటపాటి కృష్ణ, రామాంజుల చినమధు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

సైన్సుతోనే ఉజ్వల భవిష్యత్

ఆకివీడు: ఆధునిక శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం రోజురోజుకూ నూతన పోకడలతో ముందుకు వెళుతున్న తరుణంలో నేటి విద్యార్థులు సైన్సు విద్యతో ముందుకు వెళ్లాలని రీడర్స్ ఫోరం అధ్యక్షులు దాసరి వెంకట సత్యనారాయణ అన్నారు. స్థానిక మాదివాడ శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో సోమవారం ఆయన సైన్సుపైనా, ఉపాధ్యాయుడు కిషోర్ సంగీతంపైనా అవగాహన కల్పించారు. సంగీతంతో మనస్సు ప్రశాంతత పొందడమే కాకుండా శరీరంలో పలు నాడులలో కదలికలు ఏర్పడతాయన్నారు. ఉపాధ్యాయుడు లోవరాజు తెలుగు పద్యాలు, లెక్కలపై అవగాహన కల్పించారు.

వైభవంగా ఆలయ వార్షికోత్సవం

పెనుగొండ: వడలిలోని సాయి అగస్తేశ్వర సేవా సమితి ఆధ్వర్యంలోని సాయినాథుని ఆలయ ఆరో వార్షికోత్సవం వైభవంగా నిర్వహించారు. సోమవారం ఉదయం నుంచి ఈదల మోనికాదేవి, కృష్ణ దంపతులు సాయినాథునికి ప్రత్యేక పూజలు చేశారు. అన్నదానం నిర్వహించారు. ప్రత్యేక హరతులిచ్చారు.

విధుల్లో చేరిన అధ్యాపకులు

ఉండి: గ్రామీణ స్థాయిలో ప్రభుత్వ విద్యావ్యవస్థ బలోపేతానికి రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న కృషిలో భాగంగా ఉండిలో ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఏర్పాటు చేసి గత ఏడాది తరగతులు ప్రారంభించారు. దీనిలో భాగంగా ఈ ఏడాది నుంచి పూర్తిస్థాయి లెక్చరర్ల బృందం అందుబాటులోకి వచ్చింది. సోమవారం జెడ్పీ హైస్కూల్ హెచ్ఎం బేబీ సమక్షంలో జీ రాము (తెలుగు), ఎం.సూర్యకుమారి (ఇంగ్లిష్), బీ రవిశంకర్ (మ్యాథ్స్), జీ ఆంజనేయస్వామి (ఫిజిక్స్), కే కృష్ణకుమార్ (కెమిస్ట్రి), ఎస్‌వీ సత్యనారాయణ (బోటనీ), పీ విజయభాస్కర్ (జువాలజీ) బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న ఉచిత విద్యను ఇంటర్మీడియట్ విద్యార్థులు తప్పక ఉపయోగించుకోవాలన్నారు. పూర్తిస్థాయిలో అధ్యాపక బృందం అందుబాటులో ఉండటంతో ఈ విద్యాసంవత్సరంలో మంచి ఫలితాలు సాధిస్తామని వారన్నారు.

ఖరీఫ్ ముందస్తు సాగుకు రైతులు సన్నద్ధం



తాడేపల్లిగూడెం మండలం పుల్లాయగూడెంలో వరి చేనును మాగ దమ్ము చేసిన దృశ్యం, పుల్లాయగూడెంలో నారుమడి

తాడేపల్లిగూడెం రూరల్: ఖరీఫ్ సాగుకు రైతులు సిద్ధమవుతున్నారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని తాడేపల్లిగూడెం మండలంలోనే ముందుగా నాట్లు వేయడంతోపాటు, కోతలు కోస్తారు. మండలంలో అధిక భాగం మెట్ట ప్రాంతం, బోర్ల ఆధారిత వ్యవసాయం కావడంతో వెనువెంటనే వ్యవసాయ పనులు చేపడుతుంటారు. ఈ క్రమంలోనే తాడేపల్లిగూడెం మండలంలో ఇప్పటికే కోతలు పూర్తయిన పుల్లాయగూడెం, ఎల్.అగ్రహారం, మోదుగ గుంట, గొల్లగూడెం, వెంకట్రామన్నగూడెం, జగ్గన్నపేట, కడియద్ద, నీలాద్రిపురం తదితర గ్రామాల్లో మాగ దమ్ములు చేశారు. పుల్లాయగూడెం, ఎల్.అగ్రహారం గ్రామాల్లో నారుమడి కోసం విత్తనాలు చల్లి వారం రోజులు కావస్తోంది. ప్రస్తుతం విత్తనాలు మొలక దశకు చేరుకున్నాయి. మరో రెండు వారాల్లో అంటే జూన్ మొదటి వారానికి ఖరీఫ్ నాట్లు వేసేందుకు నారు సిద్ధమవుతుందని రైతులు చెబుతున్నారు. తద్వారా ఆగస్టు, సెప్టెంబరు, అక్టోబరు నెలల్లో కురిసే అధిక వర్షాల నుంచి గట్టెక్కవచ్చని రైతులు భావిస్తున్నారు. ఈ నెలాఖరు నాటికి మిగిలిన గ్రామాల్లోనూ ఖరీఫ్ పనులు ముమ్మరంగా ప్రారంభమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి.

విత్తనాలు, ఎరువులు సిద్ధం



దాళ్వా కోతలు పూర్తయిన రైతులు ఖరీఫ్ ముందస్తు సాగుకు సిద్ధం కావాలి. ప్రకృతి వైపరీత్యాలను తట్టుకుని నిలబడే ఎంటీయూ 7029, 1318, 1226 రకాల వరి వంగడాలను రైతులు సాగు చేసుకోవాలి. విత్తనాలను ఆర్‌బీకేల ద్వారా బుక్ చేసుకోవాలని, తదుపరి 48 గంటల్లో రైతులకు అందజేస్తాం. ఖరీఫ్‌కు అవసరమైన ఎరువులు సైతం రైతు భరోసా కేంద్రాల్లో సిద్ధంగా ఉంచాం. కాలువ కింద రైతులు కూడా ముందస్తు సాగుకు సిద్ధం కావాలి.

– ఆర్ఎస్.ప్రసాద్, మండల వ్యవసాయాధికారి, తాడేపల్లిగూడెం

లయన్స్ క్లబ్ జిల్లా గవర్నర్ మాణిక్యాలరావుకు సన్మానం


గట్టిం మాణిక్యాలరావును సత్కరిస్తున్న బీవీఆర్ కళాకేంద్రం కళాకారులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): బీవీఆర్ కళాకేంద్రంలో లయన్స్ క్లబ్ జిల్లా గవర్నర్‌గా ఇటీవల ఎన్నికైన గట్టిం మాణిక్యాలరావును సోమవారం ఘనగా సత్కరించారు. బీవీఆర్ వ్యవస్థాపక అధ్యక్షుడు బుద్దాల వెంకట రామారావు మాట్లాడుతూ 25 ఏళ్ల తరువాత తాడేపల్లిగూడెం ప్రాంతానికి జిల్లా గవర్నర్ రావడం ఆనందంగా ఉందని కొనియాడారు. తొలుత కళాకారుల సంఘ సమావేశం నిర్వహించారు. లవకుశ సినిమాలో కుసుడు పాత్రధారి సుబ్రహ్మణ్యానికి ఆర్థిక సత్కారం చేశారు. వక్తలు కర్రి ప్రభాకర్ బాలాజీ, పేరిచర్ల మురళీకృష్ణంరాజు, మదన్ మోహన్ అగర్వాల్, కర్రి సీతారామచంద్రరావు, కేవీ నరసింహాచార్యులు, వట్టిప్రోలు రాము, లయన్స్ సభ్యులు పాల్గొన్నారు.

అనాథ శవానికి అంత్యక్రియలు


అనాథ శవాన్ని అంత్యక్రియలకు తీసుకెళుతున్న మానవత జిల్లా నాయకుడు తాడేపల్లి మోహనరావు, సభ్యులు

పెంటపాడు: అనాథ శవానికి మానవత సంస్థ సభ్యులు అంత్యక్రియలు నిర్వహించారు. వివరాల్లోకి వెళితే సోమవారం స్థానిక కె. పెంటపాడు సెంటర్‌లో ఓ అనాథ వ్యక్తి మృతి చెందాడు. ఈ విషయాన్ని స్థానికుల ద్వారా తెలుసుకున్న జిల్లా మానవత సంస్థ అధ్యక్షుడు తాడేపల్లి మోహనరావు సంస్థ ద్వారా శాంతి రథం వాహనాన్ని సమకూర్చి సొంత ఖర్చులతో దహన సంస్కారాలు జరిపించారు. ఈ సందర్భంగా పలువురు ప్రముఖులు మోహనరావును ప్రత్యేకంగా అభినందించారు. మానవత సంస్థ ద్వారా అందుబాటులో ఉంచిన శాంతి రథం, ఫ్రీజర్‌ను సద్వినియోగం చేసుకోవాలని మోహనరావు తెలిపారు. పాతూరి రాంప్రసాద్ చౌదరి, నక్కా నాని, నక్కా కృష్ణమూర్తి, ఎం. రామకృష్ణ పాల్గొన్నారు.

ఉద్యమ నాయకుడు పర్సా సత్యనారాయణ


సుందరయ్య భవనంలో పర్సా సత్యనారాయణకు నివాళులర్పిస్తున్న కార్మిక నాయకులు, కార్మికులు


సత్యనారాయణ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): కార్మిక ఉద్యమ నాయకుడు పర్సా సత్యనారాయణ జీవితం అనుసరణీయమని పలువురు కార్మిక నాయకులు కొనియాడారు. స్థానిక సుందరయ్య భవనంలో సోమవారం గొన్నాబత్తుల నాగేశ్వరరావు అధ్యక్షతన పర్సా సత్యనారాయణ వర్ధంతి సభ జరిగింది. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రాజా రామ్మోహన్‌రాయ్, నాయకులు కర్రి నాగేశ్వరరావు, ధనాల వెంకట్రావు, పి.వేణుగోపాల్ చౌదరి మాట్లాడారు. మరో కార్యక్రమంలో రైల్వే గూడ్స్ షెడ్డు వద్ద సత్తి కోదండ రామిరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సభలో పరస సత్యనారాయణ చిత్రపటానికి నాయకులు చింతకాయల బాబూరావు, చిర్ల పుల్లారెడ్డి, కార్మికులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మరో కార్యక్రమంలో పెంటపాడు మండలం కమిటీ ఆధ్వర్యంలో గూడెం ఉల్లిపాయల మార్కెట్ యూనియన్ కార్యాలయం వద్ద పర్సా వర్ధంతి సభ జరిగింది. చల్లా చంద్రరావు, సిరపరపు రంగారావు, బంకరు నాగేశ్వరరావు కరక వెంకట్రావు, తదితర కార్మికులు, సంఘ నాయకులు పాల్గొని ఘన నివాళులర్పించారు.

తణుకులో ఘన నివాళి

తణుకు: కార్మిక ఉద్యమ నేత, మాజీ ఎమ్మెల్యే పర్సా సత్యనారాయణ 8వ వర్ధంతి కార్యక్రమాన్ని సోమవారం తణుకులో నిర్వహించారు. సీఐటీయూ ఆధ్వర్యంలో స్థానిక అమరవీరుల భవనం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సత్యనారాయణ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి పీవీ ప్రతాప్ మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రంలో కార్మిక వర్గాన్ని సంఘటిత పరిచి అనేక కార్మిక ఉద్యమాలకు నాయకత్వం వహించారని అన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు అడ్డగర్ల అజయకుమారి, పి.దక్షిణామూర్తి, సీనియర్ నాయకులు గార రంగారావు, కడలి వీర్రాజు, యర్రా రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

ప్రెస్ కౌన్సిల్ సిఫార్సులను కేంద్రం పాటించాలి

తాడేపల్లిగూడెం (టీఓసీ): జర్నలిస్టులపై దాడులు నివారణకు ప్రత్యేక చట్టం చేయాలన్న ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సిఫార్సును కేంద్ర ప్రభుత్వం పాటించాలని, వెంటనే చట్టం చేయాలని ఐజేయూ జాతీయ కార్యదర్శి డి.సోమసుందర్ డిమాండ్ చేశారు. జర్నలిస్టులపై దాడులను ఖండిస్తూ ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు సోమవారం పశ్చిమ గోదావరి జిల్లాలోని తాడేపల్లిగూడెంలో పాత్రికేయులు తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ప్రెస్‌క్లబ్ సభ్యు లు, వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు. తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు.

మీడియా ప్రతినిధులకు రక్షణ కల్పించాలని నిరసన

తణుకు టౌన్: రాష్ట్రవ్యాప్తంగా మీడియా ప్రతినిధులపై జరుగుతున్న దాడులను నిరసిస్తూ ఏపీయూడబ్ల్యూజే పిలుపు మేరకు తణుకు తహసీల్దార్ కార్యాలయం వద్ద తణుకు నియోజకవర్గ స్థాయిలో తణుకు తహసీల్దార్ కార్యాలయం వద్ద పాత్రికేయులు నిరసన కార్యక్రమం నిర్వహించారు.

24 నుంచి ఉచిత వ్యక్తిత్వ వికాస శిక్షణ తరగతులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని సత్యసాయి మందిరంలో సేవా సంస్థలు ఆధ్వర్యంలో 24 నుంచి 26 వరకు ఉదయం 9.30 గంటలనుంచి 11.30 గంటల వరకు వేసవి వెన్నెల -2023 ఉచిత వ్యక్తిత్వవికాస శిక్షణ కార్యక్రమం పాఠశాల, కళాశాల విద్యార్థిని విద్యార్థులకు నిర్వహించనున్నట్టు సంస్థ ఆధ్యాత్మిక సభ్యులు జంధ్యాల నాగేశ్వరరావు వెల్లడించా రు. 15 నుంచి 23సంవత్సరాలు వరకు వయస్సు కలిగిన విద్యార్థులు పాల్గొనవచ్చునని వివరించారు.

భగవద్గీత పారాయణతో వ్యక్తిత్వ వికాసం


వడలిలో గీతా జ్ఞాన సప్తాహాలు నిర్వహిస్తున్న దృశ్యం

పెనుగొండ: భగవద్గీత పారాయణ ద్వారా వ్యక్తిత్వ వికాసం మెరుగుపడుతుందని హైందవి ఫౌండేషన్ వ్యవస్థాపకుడు ఎం.అశోక్ పేర్కొన్నారు. వేసవి సెలవులను పురస్కరించుకొని హైందవి, గ్లోబల్ హిందూ హెరిటేజ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గీతా జ్ఞాన సప్తాహాలు నిర్వహణను సోమవారం ప్రారంభించారు. ఈనెల 28 వరకు వడలిలో మందాలమ్మ ఆలయంలోనూ, సిద్ధాంతంలోని ఆదిత్య ఇంగ్లిష మీడియం పాఠశాలలోనూ నిర్వహిస్తున్నట్టు చెప్పారు. విద్యార్థులకు ఎంపిక చేసిన 100 శ్లోకాలను నేర్పించడం, తాత్పర్యాలను వివరిస్తామన్నారు. కార్యక్రమంలో సమరసత సేవా ఫౌండేషన్ గోదావరి జోన్ కన్వీనరు చింతాలకు గోపాలకృష్ణ, మండల మహిళా కన్వీనరు చప్పా వెంకటలక్ష్మీ, దొడ్డిపట్ల గంగారత్నం, ఉప్పలపాటి చంటి, రామలింగేశ్వరరావు, డి.నాగూరు, బాల సంస్కార్ సెంటర్స్ విద్యార్థులు పాల్గొన్నారు.

సచివాలయ వ్యవస్థతోనే గ్రామ స్వరాజ్యం

భీమవరం అర్బన్: జాతిపిత మహాత్మాగాంధీ కలలు గన్న గ్రామ స్వరాజ్యాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి అవినీతి, అక్రమాలకు తావులేకుండా ప్రతి ఇంటి ముంగిటకే సంక్షేమ ఫలాలను అందిస్తూ సాకారం చేశారని ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అన్నారు. భీమవరం మండలంలోని రాయలం గ్రామంలో సాయి బాబా గుడి రోడ్‌లో రూ.65 లక్షల 30 వేలతో నిర్మించిన సీసీ రోడ్డు, రూ.45 లక్షల 70 వేలతో నిర్మించిన సచివాలయ నూతన భవనాన్ని ఎమ్మెల్యే సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వాలలో గ్రామాలలో బర్త్, డెత్ సర్టిఫికెట్లు, ఇళ్ల స్థలాల పట్టాలు, కుల ధ్రువీకరణ తదితర సేవలు పొందాలంటే కాళ్ల అరిగేలా తిరిగేవారని గుర్తు చేశారు. దీంతో సమయం, డబ్బు వృధా అయ్యేవన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అధికారం చేపట్టగానే ప్రతి 2 వేల జనాభా గల గ్రామానికి సచివాలయాన్ని ఏర్పాటు చేసి ఎనిమిది మంది వివిధ శాఖల సిబ్బందిని నియమించి ప్రతి 50 కుటుంబాలకు వలంటీర్‌ను పెట్టి మహాత్మాగాంధీ ఆశయాలకు అనుగుణంగా అవినీతి అక్రమాలకు తావులేకుండా స్వచ్ఛమైన పాలనను అందిస్తున్నారన్నారు. సచివాలయాలు ద్వారా సుమారు 630 పైగా సేవలు అందిస్తూ దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఆదర్శ పాలనను సాగిస్తున్నారన్నారు. ప్రజా సమస్యల పట్ల సచివాలయ సిబ్బంది జవాబుదారీతనంగా పనిచేస్తున్నారన్నారు. ప్రతి గ్రామంలో సీసీ రోడ్డు, డ్రెయిన్లు, జలజీవన్ మిషన్ ద్వారా స్వచ్ఛమైన త్రాగునీరు ఇచ్చేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఇది ప్రజా ప్రభుత్వమని ప్రజల కోరిక మేరకు అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. ఈ సందర్భంగా పలువురు స్థానిక సమస్యలను ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ దృష్టికి తీసుకురాగా అక్కడికక్కడే అధికారులతో మాట్లాడి సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆదేశాలు జారీ చేశారు. దీంతో గ్రామస్తులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

శిథిల వంతెన పునర్నిర్మాణానికి చర్యలు

ఉండి: ఉండి రైల్వేస్టేషన్ రోడ్డులో పంటకాలువపై శిథిలావస్థకు చేరిన వంతెనను పంచాయితీరాజ్ డీఈ కేఎస్ శ్రీనివాసరావు, సర్పంచ్ కమతం సౌజన్య, ఉప సర్పంచ్ గొట్టుముక్కల కల్యాణ్ సోమవారం పరిశీలించారు. వంతెనను 1933లో నిర్మించిన ఈ వంతెనను 60 ఏళ్ల క్రితమే అనగా 1993లోనే తొలగించాల్సి ఉందని డీఈ అన్నారు. అయితే వంతెన కింద ఉన్న పిల్లర్లు బలంగా ఉండటంతో వాటిని అలాగే ఉంచి శిథిలమైన పైభాగాన్ని తొలగించి భీమ్‌లు పోసి పైన స్లాబ్ వేస్తే వంతెన మరింత కాలం మన్నుతుందన్నారు. గ్రామంలోని ఐదు వార్డుల ప్రజల రాకపోకలకు ఈ వంతెనే ఆధారమని, దీనిని త్వరగా పునర్నిర్మాణం చేయాలని ప్రజాప్రతినిధులు కోరారు. త్వరలోనే అంచనాలు తయారు చేసి ఉన్నతాధికారులకు పంపి మంజూరు జరిగేలా చర్యలు తీసుకుంటామని డీఈ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు సురేష్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయంలో కొనసాగుతున్న వేసవి తరగతులు


తాడేపల్లిగూడెం శాఖ గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన తరగతులలో బాల బాలికలు

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని గ్రేడ్ -1 శాఖ గ్రంథాలయంలో సోమవారం వేసవి శిక్షణా విజ్ఞాన తరగతులు గ్రంథాలయాధికారి వానపల్లి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. గ్రంథాలయంలోని పుస్తకాలను విద్యార్థులతో చదివించారు. పోషకాహారం వల్ల లాభాలు, వేసవిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వివిధ పాఠ్యాంశాలు బోధించారు. విశ్రాంత ఉద్యోగులు, ఉపాధ్యాయులైన ఎస్.సాల్మన్ రాజు, మహాశివభట్టు లక్ష్మణరాజు, పీజీ స్టూడెంట్ ఎస్.కొండలరావు, ఏవీ లక్ష్మణ్, అనంతపల్లి జనార్ధనరావు, తదితరులు విద్యార్థులకు వివిధ పాఠ్యాంశాలపై అవగాహన కల్పించారు.

ఉత్సాహంగా వేసవి శిక్షణ శిబిరాలు

తణుకు టౌన్: గ్రంథాలయాల ఆధ్వర్యంలో ప్రభుత్వం చేపట్టిన వేసవి శిక్షణ శిబిరాల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. సోమవారం తణుకులో బ్యాంక్ కాలనీలోని పురుషుల శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు కథల పుస్తకాలు, చదవడం, విద్యార్థులతో కథలు చెప్పించడం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. తణుకులోని మహిళా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరంలో విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. అనంతరం క్రాఫ్ట్ పేపర్‌తో బొమ్మలు తయారు చేసే విధానం, భగవద్గీత శ్లోకాలను నేర్పించడం, నీతి కథలు చెప్పించడం, కథలు చదవడం ఇంగ్లీష్ పదాలకు అర్థాలు చెప్పించడం, చెస్ శిక్షణ, అంత్యాక్షరి వంటి శిక్షణ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రీసోర్సు పర్సన్ జే అలకనంద, గ్రంథాలయ అధికారి ఎస్ ప్రవీణ పాల్గొన్నారు. సోమవారం తణుకు రూరల్ మండలం వేల్పూరులోని జిల్లా గ్రంథాలయంలో నిర్వహించిన వేసవి శిక్షణ శిబిరంలో విద్యార్థులకు కథలు చెప్పడం, కథలు చదివించడం, విద్యార్థులకు వ్యాసరచన పోటీలను నిర్వహించారు. ఈకార్యక్రమంలో రిటైర్డ్ ఎంఈవో కోరా సత్యనారాయణ, రిటైర్డ్ ఏఈ కేఆర్ చక్రధరరావు, గ్రంథాలయ అధికారి వైవీ సాయిబాబు పాల్గొన్నారు.